క్లుప్తంగా

10న మెగా పేరెంట్స్ డే



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

డోన్ టౌన్: ఈ నెల 10వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ డేను విజయవంతంగా నిర్వహించాలని డోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని యు.కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, సౌకర్యాలపై ఆరా తీశారు. సమయం వృథా చేసుకోకుండా బాగా చదువుకోవాలని సూచించారు. హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లెప్రసీ కాలనీలో అన్నదానం



ఆహార పొట్లాలు అందజేస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

డోన్: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో లెప్రసీ, అంధుల కాలనీలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ సూచన మేరకు సంఘం కార్యదర్శి గాలయ్య, అధ్యక్షుడు సుబ్బరాయుడు, సభ్యులు రాందాస్‌రెడ్డి, దాసప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం



రోటరీ క్లబ్ అధ్యక్షున్ని సత్కరిస్తున్న సభ్యులు

డోన్: స్థానిక రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాజా విజయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా జింకల క్రిష్ణ, కార్యదర్శిగా బలరాంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ



బనగానపల్లెలో పింఛన్ల పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లెరూరల్: పట్టణంలోని గోపాల్ నగర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. రాష్ట్రంలో జూన్ నుంచి కొత్తగా 71 వేల మందికి స్పౌజ్ కింద పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్, పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: కోల్‌కత్తాలో లా విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డోన్ బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం డోన్ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

మాదిగ మేళాను జయప్రదం చేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ సభ్యులు

డోన్ టౌన్: ఈ నెల 7వ తేదీ జరగనున్న మాదిగ మేళాకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ రామకొండ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా కన్వీనర్ రాజు, సభ్యులు కొయిలకొండ దేవేంద్ర, అశోక్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- సుంకేసుల, చనుగొండ్ల ఎంఎల్‌హెచ్‌పీల తీరుతో రోగుల ఇక్కట్లు
- గ్రామానికి దూరంగా వైద్య సేవలు
- నడిచి వెళ్లలేక గర్భిణులు, వృద్ధుల అవస్థలు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్న మెడికల్ ఆఫీసర్



సుంకేసులలో ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన 104 వైద్య సేవల కోసం గతుకుల రోడ్డుపై నడిచి వెళ్తున్న గర్భిణులు

అవుకు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నా, కొంత మంది ఆరోగ్య సిబ్బంది తాము చెప్పిందే జరగాలని పట్టుబడుతూ గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ×అంతా మా ఇష్టం అన్న రీతిలో వ్యవహరిస్తూ, అందుబాటులో ఉండాల్సిన వైద్య సేవలను గ్రామాలకు దూరంగా నిర్వహిస్తున్నారు. సుంకేసుల గ్రామంలో గతంలో గ్రామ సచివాలయం వద్దనే 104 వాహనంతో సంచార వైద్య సేవలు అందించేవారు. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) వైద్య సేవలు అందించే చోటును స్వయంగా నిర్ణయించుకుని గ్రామానికి దాదాపు 500 మీటర్ల దూరంలో, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతంలో వైద్య సేవలు పొందే పరిస్థితి కల్పించారు. దీనివల్ల గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చికిత్స కోసం గతుకుల రోడ్లపై నడవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

వైద్య సేవలు పొందాలంటే శ్రమ పడాల్సిందే

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఆయా గ్రామాల్లోనే వైద్య సేవలను పొందే ఏర్పాటు చేసింది. సచివాలయాల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, భవన నిర్మాణాలను చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని నిర్మాణ పనులను ఆపివేసింది. దీంతో కొన్ని చోట్ల భవనాలు పూర్తయినా సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయలేదు. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా భవన నిర్మాణాలు ఉన్నాయి. దీంతో వైద్యాధికారులు ఆయా గ్రామాల్లో రోగులకు అనుకూలమైన చోట వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు 104 వాహనం ద్వారా రోగులకు వైద్య చికిత్స, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు. అవుకు మండలం సుంకేసుల గ్రామంలో కొన్నాళ్ల కిందటి వరకు ప్రజలకు గ్రామంలోని సచివాలయం వద్దే సంచార చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే అక్కడ ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి సచివాలయంలో వైద్యసేవలు నిర్వహించకుండా గ్రామానికి 500 మీటర్ల దూరంలో రోడ్డు సౌకర్యం లేని సెంటర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు.

చనుగొండ్లలోనూ అదే కథ

చనుగొండ్ల గ్రామంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీ పూర్తికాని భవనంలో (ఎక్యుప్‌మెంట్‌లు, కిటికీలు, తలుపులు లేకుండా) గ్రామానికి దూరంగా వైద్య సేవలు అందిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కర్ర సాయంతో వస్తున్న వృద్ధుడు

చెప్పినా వినడం లేదు

ఊరికి దూరంగా వైద్య సేవలు ఏర్పాటు చేయొద్దని.. ప్రజలు అంతదూరం రావాలంటే ఇబ్బంది పడతారని ఎన్నిసార్లు చెప్పినా ఎంఎల్‌హెచ్‌పీ వినడం లేదు. మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశాం. స్థానికంగా వైద్య సేవలు అందిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

–పార్థసారథిరెడ్డి, ఉపసర్పంచ్, సుంకేసుల

ఆయాసం ఎక్కువవుతోంది



నాకు 80 ఏళ్లు, ఆస్తమా రోగిని. చికిత్స కోసం అంత దూరం నడవలేకపోతున్నా. వైద్యం కోసం కట్టె పట్టుకుని నడిచి రావాలంటే ఆయసం మరింత ఎక్కువ అవుతోంది. ఆగుతూ ఆగుతూ రావాల్సి వస్తోంది. రోడ్డు కూడా సక్రమంగా లేదు. ఈ వయసులో నడిచి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నా.

–అనకల చిన్నపురెడ్డి, వృద్ధుడు, సుంకేసుల

గతుకుల రోడ్డులో నడవలేకున్నా



నాలుగు నెలల గర్భిణిని. అంత దూరం నడవలేకున్నా. ప్రతి పరీక్షకు నా భర్త బైక్‌పై తీసుకెళ్తున్నారు. గతుకుల రోడ్లపై రావాలంటే ఇబ్బందిగా ఉంది. ఇలాంటి సమయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్న వైద్యులే, ఇబ్బందికర ప్రాంతాల్లో సేవలను ఏర్పాటు చేయడమేమిటి?

–శివ పార్వతి, గర్భిణీ, సుంకేసుల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సుంకేసుల, చనుగొండ్ల గ్రామాల ప్రజలు ఎంఎల్‌హెచ్‌పీల పనితీరుతో ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి.

–జయభారత్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్, ఆకుమళ్ల పీహెచ్‌సీ

విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దు



క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కోవెలకుంట్ల: వివిధ రకాల పంటల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించవద్దని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త రవిప్రకాష్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బిజనవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తతోపాటు ఏడీఏ సుధాకర్, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి గ్రామ పరిధిలో సాగు చేసిన మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించే అస్కారం ఉందన్నారు. ఎప్పటికప్పుడే వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏటా ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంట మార్పిడి విధానం అవలంభించాలని సూచించారు. రైతులు రెండేళ్ల నుంచి శనగ పంట సాగు చేసి నష్టపోతున్నారన్నారు. శనగ పంట వేసే ముందు జూన్, జులై నెలల్లో తక్కువ పంటకాలం కలిగిన మినుము, పెసర, కొర్ర, తదితర పంటలు సాగు చేయడం అన్ని విధాలా లాభదాయకమన్నారు. భూమిలో పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని కలియదున్నుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్ర ఏడీ హేమ సుందర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత స్వార్థం కోసమే కార్యాలయ తరలింపు



డాక్యుమెంట్ రైటర్లకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: టీడీపీ నాయకుడి వ్యక్తిగత ఆదాయం కోసం ప్రజలను బలిచేస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చితే చూస్తూ ఊరుకునేది లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, మండల కమిటీ సభ్యుడు ఎస్ఏ చిన్న రహిమాన్ హెచ్చరించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దని డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమం మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్దకు సీపీఎం నాయకులు చేరుకుని వారికి మద్దతు తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఉన్న కార్యాలయాన్ని భద్రత లేని శివారు ప్రాంతానికి మార్చడం ఏంటని ప్రశ్నించారు. టీడీపీ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, నాగమద్దయ్య, ఐద్వా నాయకురాలు షమీమ్‌బేగం, రాజ్‌కుమార్, రసూల్, చాముండేశ్వరి, రాజమ్మ, సులోచన, షభానా పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



కొలువుదీరిన సయ్యద్ ఇమామ్ కాశీం పీర్లు

బేతంచెర్ల: మండంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్లు కొలువు దీరాయి. పట్టణంలోని కోటపేట కాలనీలో సయ్యద్ ఇమామ్ కాశీం, గౌరిపేటలో బారే ఇమామ్, హుసేన్, హుసేన్, బైటిపేటలో మౌలాలీస్వామి పీర్ల చావిడీలను ఉత్సవాలకు ముస్తాబు చేశారు. బేతంచెర్ల పట్టణం, ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, సిమెంట్ నగర్ గ్రామాల్లో గురువారం నిర్వహించనున్న చిన్న సరిగెత్తు, శనివారం నిర్వహించనున్న పెద్ద సరిగెత్తు కోసం పీర్ల చావిడీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆశ్రమ నిర్వాహకుడికి ఆర్థికసాయం



ఆశ్రమ నిర్వాహకుడితో ప్రభుత్వ ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం–కొలుములపల్లె మార్గంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకుడికి ప్రభుత్వ ఉపాధ్యాయులు అండగా నిలిచారు. కొలుములపల్లె గ్రామానికి చెందిన హుసేన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నిర్వహిస్తూ రహదారి వెంట వెళ్తున్న వారికి అన్నదానం చేస్తుండేవారు. అయితే కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు విరిగింది. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక, ఆదరణకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నాడు. ఒకప్పుడు రహదారి వెంట వెళ్లేవారికి అన్నదానం చేసి వారిక ఆకలి తీర్చిన హుసేన్ ప్రస్తుతం మంచానికే పరిమితం అయ్యారు. ఆయన దీన స్థితిని తెలుసుకున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాం బేగ్, ఉపాధ్యాయులు తిమ్మయ్య, క్రిష్ణారెడ్డి, రమేష్, వెంకటస్వామి మంగళవారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.



ముదిగేడులో ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

రోడ్డుపైనే మురుగు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో మురుగు సమస్య వెంటాడుతోంది. ప్రధాన రహదారిలో రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు తాగునీటి పైపులైన్ లీకేజీలు గ్రామస్తులను కలవరపెడుతున్నాయి. కోవెలకుంట్ల–అవుకు ప్రధాన రహదారిలో మురుగు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు పక్కన నివాసం ఉన్న వారు దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాహనాలు వెళ్లే సమయాల్లో ఇంటిలోకి మురుగు పడుతోందని మెయిన్ బజార్ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను తీర్చాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు యాగంటిలో బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని ప్రసిద్ధ యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రక్షాధారాలు, రుద్రాక్షమాలలు, కరుంగలి మాలలు, పూసల మాలలు, రాగి కడియాలు అమ్ముకునే హక్కుల కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన వారు ముందుగా రూ.50,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన వ్యక్తులు హాజరుకావాలని సూచించారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు

డోన్ టౌన్: పట్టణంలో వీధి వ్యాపారులను గుర్తించే ప్రక్రియ మొదలు పెట్టినట్లు కమిషనర్ ప్రసాద్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి గుర్తిస్తామన్నారు. వ్యాపారులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఓటర్ కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పాతవారైతే గతంలో మంజూరు చేసిన ఐడీ కార్డును కూడా జత చేయాలని తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందు

డోన్: గొర్రెలు, మేకల్లో నట్టల వ్యాధి నివారణకు ఈనెల 10వ తేదీ వరకు డీవార్మింగ్ మందులను ఉచితంగా ఇవ్వనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు అన్నారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నట్టల నివారణ కోసం ద్రావణాన్ని తాపించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మందు జీవాలకు తాపడం వల్ల అంతర్ పరాన్న జీవుల వల్ల కలిగే రుగ్మతలు నయమవుతాయని తెలిపారు. ఆరోగ్యంతో పాటు జీవాల పెరుగుదల బాగుంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు గౌసియాభేగం, పద్మావతి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పీ4 కమిటీని ఏర్పాటు చేయాలి



పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: సమాజ అభివృద్ధి కోసం ప్రముఖులను గుర్తించి పీ4 కమిటీని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి కలగన్న బంగారు కుటుంబాలతో అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో రేషన్ సరుకులు, పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తమ్మడపల్లెలో చోరీ

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సులోచన, కుమార్తెలు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.4వేల నగదుతో పాటు బియ్యం బస్తాను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు సులోచన వాపోయింది.

వివాహిత ఆత్మహత్య



వేదావతి మృతదేహం

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామానికి చెందిన వేదావతి(38) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ మేరి తెలిపిన వివరాలు.. గత మార్చిలో భర్త చెన్నయ్య లష్కర్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త ఉద్యోగం భార్య వేదావతికి ఇచ్చారు. అయినా జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లోనే గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి డాక్టర్లు ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



హెచ్ఎం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు,



మనోహర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్: ఉపాధ్యాయులే భావిభారతావనికి మార్గదర్శకులని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు అన్నారు. మండలంలోని మల్లెంపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇబ్రహీం పదవీ విరమణ సందర్భంగా మంగళవారం వీడ్కోల కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీం దంపతులను రథంపై కూర్చోబెట్టి గ్రామ పురవీధుల మీదుగా ఊరేగించి అభిమానాన్ని చాటుకున్నారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేక మందికి అత్యుత్తమ విద్యాబోధన చేశారని కొనియాడారు. గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుతో పాటు రెడ్‌క్రాస్ అవార్డును కూడా పొందిన విషయాన్ని గుర్తుచేశారు. యూటీఎఫ్ నేతలు సుబ్బారెడ్డి, సురేష్, ఉమ, శివశంకరయ్య, విద్యా కమిటీ చైర్మన్ రామాంజనేయులు, వైస్ చైర్మన్ శివలక్ష్మి ఎంఈఓలు రామనర్సప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు. కాగా మల్లెంపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో 450 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు రూ.3వేల చొప్పున మొత్తం రూ.27 వేలను మెహతాజ్ షోరూం అధినేత జహంగీర్ అందజేశారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు

ప్యాపిలి: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారులు రామకృష్ణయ్య, వెంకటేశ్‌నాయక్ అన్నారు. గుడిపాడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ హుసేనాపురం పాఠశాలకు బదిలీపై వెళ్లిన మనోహర్‌ను మంగళవారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఉపాధ్యాయులు తాము పనిచేసిన పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు మనోహర్‌ను తోటి ఉద్యోగులతో పాటు గ్రామస్తులు సన్మానించారు. ఎంపీటీసీ ఓబులేసు, గుడిపాడు హెచ్ఎం కీర్తి చందర్, యూటీఎఫ్ నాయకులు అబ్దుల్ లతీఫ్, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, అంజనేయ ప్రసాద్, సనావుల్లా ఖాన్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

డోన్ టౌన్: మండలంలోని కొచ్చెర్వు పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ పొందిన కె.సుబ్బరామయ్యను మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తోటి ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ఎంఈఓ రామనర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణానికి చెందిన బనగానపల్లె డిప్యూటీ రెంజర్ ఈడిగ వెంకటరమణగౌడ్ అటవీశాఖలో విశేష సేవలందించి నేడు పదవీ విరమణ పొందడం ఆనందదాయకమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కాటసాని ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన్ను సన్మానించారు. ఆయన ఏ ప్రాంతంలో విధులు నిర్వహించినా బనగానపల్లెపై అభిమానం ఉండేదన్నారు. ఆయన కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ఆరోగ్య ప్రదాతలు




వైద్యులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

డోన్: వైద్యులు ఆరోగ్య ప్రదాతలని.. సృష్టికి ప్రతిసృష్టి చేసే దైవ సమానులు వైద్యులని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జింకల క్రిష్ణ, బలరాం అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, నవ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, డాక్టర్ వాసుదేవ ఆచారిలను ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ డే రోజు డోన్ రోటరీ క్లబ్ 25 వసంతాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఏపీ రావు, సత్తార్ హజీ, శంకర్, సత్యసేనారెడ్డి, దశరథరామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజయ్య, శేఖర్, షాలు, రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కే కదా అని వదిలేస్తే..!

పట్టణంలోని శేషారెడ్డి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) భవనంపై మొక్కలు పెరుగుతున్నాయి. ఇవి భవన భద్రతకు ముప్పుగా మారుతోంది. 1952లో రావుబహదూర్ బీపీ శేషారెడ్డి నిర్మించిన ఈ వైద్యశాల భవనం ఇప్పటికీ చెక్కుచెదరకుండా సేవలందిస్తోంది. కానీ ఇటీవల భవనం పైభాగంలో జువ్వి, రావి మొక్కలు పెరుగుతున్నాయి. వీటిని ప్రాథమిక దశలోనే తొలగించకపోతే, వేళ్లతో గోడలు బలహీనమై భవనాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది.

–బేతంచెర్ల



సీహెచ్‌సీ భవనంపై పెరిగిన మొక్కలు